ఉచిత వైద్య శిబిరానికి స్పందన


పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ నర్సింహాయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి ఈద్గా వద్ద రిలయెన్స్ మెడికల్ నిర్వాహకులు వాజీద్, ఇలియాస్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదారాబాద్ సనత్ నగర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐకానిక్ ఐకేర్, రిలయన్స్ డేటుడే కేర్ పాలిక్లినిక్ డాక్టర్లు ఆయనకు బీపీ, షుగర్, ఐ టెస్ట్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లోనూ శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇర్ఫాన్, కర్రె జంగయ్యతో పాటు రోగులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం


అన్నదానం చేస్తున్న నాగేశ్వరరావు తదితరులు

మోతీనగర్: మోతీనగర్ సీనియర్ సిటిజన్ కౌన్సెలింగ్ ఫోరం ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ సాగర్ తండ్రి లక్ష్మీనారాయణ వర్ధంతి సందర్భంగా ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక వైద్యశాలలో రోగులు, వారి సహాయకులకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మోతీనగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్ ఫోరం సీనియర్ సభ్యుడు ఎంసీహెచ్‌ఎస్ మాజీ అధ్యక్షుడు బిజముల్ల నాగేశ్వరరావు, బ్రహ్మానంద రెడ్డి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సభ్యుడికి అభినందనలు


జగదీశ్వర్‌గౌడ్‌ను అభినందిస్తున్న సత్యం గౌడ్, శిరీష సత్తూర్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ వి. జగదీశ్వర్‌గౌడ్‌ను పలువురు నాయకులు ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. శేరిలింగంపల్లి కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కూన సత్యం గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

శివాలయం నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: చంద్రమ్మకాలనీలో శివాలయం నిర్మాణం పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పలనియమ్మ, బాలరాజు, యాదగిరి, రమేశ్, సత్తిబాబు, రాజు, ఆంజనేయులు, కురుమూర్తి, రాజారెడ్డి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, సర్వేశ్వరరావు, సత్యనారాయణ, కనకాచారి, మాధవ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!


శివశక్తినగర్‌కాలనీకి వెళ్లే దారిలో మూతలేని మ్యాన్‌హోల్

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని శివశక్తినగర్ కాలనీకి వెళ్లే దారిలోని ఓ మ్యాన్‌హోల్ మూత లేకుండా ప్రమాదకరంగా మారింది. వాహనదారుల భద్రత దృష్ట్యా స్థానికులు కట్టెలను అడ్డుగా పెట్టారు. ఇది హుస్సేన్‌సాగర్‌కు వరకు వెళ్లే భారీ నాలా కావడంతో ఎప్పుడూ మురుగు ప్రవాహం ఉంటుంది. పొరపాటున ఎవరైనా అందులో పడితే గల్లంతు అయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నాలాల్లోనే చెత్త..!

మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లో అధ్వానంగా ఓపెన్ డ్రైనేజీలు

- నెలలుగా పేరుకుపోతున్న చెత్తాచెదారం
- మరోవైపు తీసిన పూడిక తరలించకపోవడంతో మళ్లీ అందులోకే
- ఇబ్బందుల్లో కాలనీవాసులు, పట్టని అధికారులు


సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్ ఇళ్ల మధ్య నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు

మోతీనగర్: మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లోని ఓపెన్ నాలాలు అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని నెలలుగా పూడిక తీయకపోవడంతో చెత్తాచెదారంతో నిండి దుర్వాసన వెదజల్లుతోంది. మరోవైపు పలు బస్తీలు, కాలనీల్లో అక్కడక్కడ నామమాత్రంగా పూడిక తీసినా నెలల తరబడి తరలించకపోవడంతో గాలి దుమారం..వర్షాలు పడినప్పుడు తిరిగి అది నాలాల్లోకే చేరుతోంది. దీంతో పూడిక తీసినా ఫలితం ఉండడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, గాయత్రీనగర్, జ్యోతినగర్, లక్ష్మీనగర్, అల్లాపూర్, న్యూ రామారావునగర్ అలాగే మూసాపేట డివిజన్‌లోని అవంతినగర్‌తోట, బబ్బుగూడ, కబీర్‌నగర్, స్నేహపురి కాలనీల్లోని ఇళ్ల మధ్యనే ఉన్న ఓపెన్ నాలాల్లో కొన్ని నెలలుగా పూడిక తీయకపోవడంతో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరోవైపు బబ్బుగూడ, అవంతినగర్ తోట ఇళ్ల మధ్యనే రైల్వే ట్రాక్ కిందనున్న ఓపెన్‌నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని కొన్ని రోజుల కిందట తొలగించినా ఇప్పటికీ తరలించలేదు. ఈ విషయమై స్థానిక ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లోని ఇళ్ల మధ్యన ఉన్న ఓపెన్ నాలాల్లో కనీసం 3 నెలలకు ఒకసారి అయినా పూడిక తీసివేసి అందులోని చెత్తాచెదారం, మట్టి తరలిస్తే కొంత ఉపశమనం కలుగుతుందని ఆయా బస్తీ, కాలనీవాసులు అధికారులకు మొర పెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పూడిక తీయడంతో పాటు చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బబ్బుగూడ, అవంతినగర్ తోట ఇళ్ల మధ్య నాలా పరిస్థితి

అనారోగ్యం బారిన ప్రజలు..


బబ్బుగూడ రైల్వే ట్రాక్ సమీపంలో ఇళ్ల మధ్యన అలాగే అవంతినగర్ తోట, బబ్బుగూడ గృహాల మధ్య ఉన్న ఓపెన్ నాలాల్లో నెలల తరబడి చెత్తాచెదారం తీయడం లేదు. దీంతో దుర్వాసనతో స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. అంతేకాకుండా పలోచోట్ల తీసిన పూడికను వెనువెంటనే తరలించాలి.

–బోడ శ్రీనివాసరావు, సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బబ్బుగూడ

బాలానగర్‌లో జాతీయ జెండావిష్కరణ


జాతీయ పతాకావిష్కరణలో బండి రమేశ్, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు

బాలానగర్: బాలానగర్ కాంగ్రెస్ కార్యాలయంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ ఆదివారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎప్పుడూ పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు లాల్జీ దేశాయ్, రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ హాజరై మాట్లాడుతూ.. ప్రతినెలా చివరి ఆదివారం జాతీయ జెండా ఆవిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పరెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మయ్య, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి సేవాదల్ పార్టీ వాజీద్ పాషా, అంజాద్, టెంపుల్ కమిటీ మెంబర్లు, బ్లాక్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాళ్లు, యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్థానికుల సహకారంతో సేవా కార్యక్రమాలు


ఆధ్యాత్మిక పుస్తకాలు, బీరువా అందజేసిన దాతలు

మోతీనగర్: స్థానికుల సహాయ సహకారాలతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మోతీనగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిలింగ్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి. ప్రసాద్ పేర్కొన్నారు. మోతీనగర్ సీనియర్ సిటిజెన్ కౌన్సిల్ ఫోరంకు జయంతి లక్ష్మీ నారాయణ పలు ఆధ్యాత్మిక పుస్తకాలను, అదేవిధంగా అన్నపూర్ణ దంపతులు బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయో వృద్ధుల కోసం తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీహెచ్‌ఎస్ మాజీ అధ్యక్షుడు నలమాల్పు అంజిరెడ్డి, భుజముల నాగేశ్వరరావు, సభ్యులు బ్రహ్మానంద రెడ్డి, మహమూద్ ఆలీ, కొల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 23న ఎన్నికలు


మాట్లాడుతున్న అధ్యక్షుడు పెసరి సంజీవరెడ్డి, పాల్గొన్న గాయత్రీనగర్ వాసులు

మోతీనగర్: గాయత్రీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు మార్చి 23న నిర్వహించనున్నట్లు ప్రస్తుత సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. గాయత్రీనగర్‌లోని సీనియర్ సిటిజన్ భవనంలో సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘంలో నూతన ఓటర్లు నమోదు, తొలగింపుకు మార్చి 9 చివరి తేదీ అన్నారు. త్వరలో ఎన్నికల విధి విధానాలను ప్రకటిస్తామని తెలిపారు. సంఘం చేసిన అభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గాయత్రీనగర్ వాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పెసరి సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్. రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి. సంజీవ్ జైన్, కోశాధికారి జి. వెంకటరమణతో పాటు సంఘం ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణతో సాఫీగా రాకపోకలు..!



వివేకానందనగర్ డివిజన్ పరిధిలో హైటెన్షన్ లైన్లు ఉన్న ప్రాంతంలో నూతనంగా వేసిన రోడ్డు

ఆల్విన్‌కాలనీ: హైటెన్షన్ విద్యుత్ లైన్లు ఉన్న రోడ్ల విస్తరించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైటెన్షన్ విద్యుత్ స్తంభాల కింద ఉన్న రహదారులను విస్తరించి మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని మెట్రో రైలు పనుల సమయంలో గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ రోజాదేవి రంగరావు ప్రత్యేక దృష్టి సారించి వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నుంచి మాధవరం కాలనీకి వెళ్లే రహదారి మధ్యలోని నాలాపై కల్వర్టును ఏర్పాటు చేసి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా బ్రిడ్జి, రహదారి విస్తరణ పనులు పూర్తి కావడంతో కుత్బుల్లాపూర్ సర్కిల్ నుంచి కూకట్‌పల్లి సర్కిల్ మీదుగా హైటెక్ సిటీ, మియాపూర్, లింగంపల్లి తదితర ప్రాంతాలకు మెరుగైన రవాణా కలిగిందని వాహనదారులు పేర్కొంటున్నారు.

రేపటి నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో ఈనెల 25 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పి. నాగిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు గణపతి పూజ, రుద్ర హోమం, 26న మహాశివరాత్రి రోజు తెల్లవారుజామున 4.30 నుంచి కాశీ విశ్వేశ్వర స్వామికి సామూహిక సంతధార అభిషేకాలు, ఉదయం 10 గంటలకు రుద్రహోమం, అర్చనలు, రాత్రి 9.30 గంటలకు కాశీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం, 27న నిత్యాభిషేకాలు, రుద్ర హోమం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

మేనమామపై అల్లుడి దాడి

జగద్గిరిగుట్ట: మేనమామపై అల్లుడు దాడి చేసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ వెస్ట్‌మారెడ్‌పల్లి సీతాపతికాలనీకి చెందిన గుడి భూపాల్‌రెడ్డి వ్యాపారం చేస్తుంటాడు. కాగా గాజులరామారం ప్రాంతానికి చెందిన తన మేనల్లుడు చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి గతంలో ప్రింటింగ్ బిజినెస్ చేశాడు. లావాదేవీల్లో ఇరువురి మధ్య విభేదాలు తలెత్తడంతో విడిపోయారు. భూపాల్‌రెడ్డికి బాకీ ఉండగా అతని తల్లి, అక్క వెళ్లడంతో చంద్రశేఖర్‌రెడ్డి చెక్కులు ఇచ్చాడు. అదే సమయంలో చంద్రశేఖర్‌రెడ్డి భూపాల్‌రెడ్డి గురించి తన భార్యకు చెడుగా చెప్పాడు. దీంతో ఆదివారం ఈ విషయం మాట్లాడేందుకు భూపాల్‌రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి దగ్గరికి వెళ్లాడు. అదే సమయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరగగా షాపులో ఉన్న కొబ్బరి కాయతో భూపాల్‌రెడ్డిపై దాడి చేశాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో అకస్మాత్తుగా మంటలు

సుభాష్‌నగర్: మరమ్మతుల కోసం వర్క్‌షాప్‌కు వచ్చిన బస్సు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయ్యింది. సూరారం ప్రధాన రోడ్డును ఆనుకొని కట్టమైసమ్మ ఆలయం సమీపంలోని ఎస్.ఎస్ బస్‌బాడీ కంపెనీకి నూతన బస్సును అదనపు మరమ్మతుల కోసం ఆదివారం తీసుకువచ్చారు. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా బస్సులో నుంచి మంటలు చేలరేగాయి. దీనికితోడుగా పక్కనే చెట్ల కొమ్మలకు మంటలు వ్యాపించడంతో ఉవ్వెత్తిన ఎగిసి పడ్డాయి. స్థానికుల సమాచారంతో జీడిమెట్ల అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో బస్సు పూర్తిగా కాలిపోయింది.

ఫామ్‌హౌస్ నిర్వాహకుడిపై కేసు

కుత్బుల్లాపూర్: అనుమతుల్లేకుండా హుక్కా, మద్యం విక్రయిస్తున్న ఫామ్‌హౌస్ నిర్వాహకుడిపై పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. శనివారం అర్ధరాత్రి అయోధ్యనగర్ చౌరస్తాలోని ఫామ్ స్టే ఫామ్‌హౌస్‌పై పేట్‌బషీరాబాద్ పోలీసులు దాడి చేసి పలువురు హుక్కా, మద్యం సేవిస్తుండగా పట్టుకున్నారు. రెండు హుక్కా పాట్స్, 10 మద్యం సీసాలను సీజ్ చేసి నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన అసోసియేషన్ సభ్యులు


ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో సభ్యులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ రాంనరేశ్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సభ్యులు కాలనీవాసులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతుల రాజేందర్, అంబాదాసు, కార్యవర్గ సభ్యులు చాట్ల రవి అచ్చగారి రాజిరెడ్డి, సత్యనారాయణ చెట్టి, చంద్రయ్య, సురేశ్ నక్క, ఎం. రాజిరెడ్డి, ఉమామహేశ్వర్‌రావు, బ్రహ్మయ్య, నాగర్జున రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహం ఆవిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ జన్మభూమికాలనీలో శ్రీ వాల్మీకి బోయ కిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వాల్మీకి సంస్కృత సాహిత్యంలో పేరెన్నికగల కవి అని, రామాయణాన్ని రచించారని, ఆయన్ని సంస్కృత భాషకు ఆదికవిగా గుర్తిస్తారన్నారు. ఆయన జీవితం ఎంతోమందికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో రామగుండం కార్పొరేటర్ అడ్డాల స్వామి, వాల్మీకి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రేపల్లె కృష్ణ వాల్మీకి, ప్రధాన కార్యదర్శి జ్యోతి, బోయ నగేశ్, బోయ తిమ్మప్ప, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పశువుల సంత ప్రాంతంలో స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాలి


సంతకాల సేకరణలో అఖిలపక్ష నాయకులు

మోతీనగర్: బబ్బుగూడలోని పశువుల సంత ప్రాంతంలో స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాలని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మైదానం నిర్మాణం విషయమై 15 రోజులుగా సంతకాల సేకరణ చేపడుతున్నారు. ఇందులో భాగంగా అవంతినగర్ తోట ముఖ ద్వారం వద్ద ఆదివారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. పశువుల సంత వారానికి 2 రోజులు మాత్రమే ఉంటుందని, మిగిలిన రోజుల్లో బహిరంగ ప్రదేశం కావడంతో మందుబాబులకు అడ్డాగా మారడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతోందన్నారు. గత ప్రభుత్వం ఈ స్థలంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మించాలని శంకుస్థాపన చేసినప్పటికీ అనివార్య కారణాలతో నిర్మించలేకపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్పోర్ట్స్ స్టేడియం నిర్మిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు కడపన గోపాల్‌రెడ్డి, సీహెచ్. సత్యనారాయణ, గార్లపాటి మోహన్‌రెడ్డి, జి. వెంకటేశ్వర్లు, కండోజర్‌రావు, బాల్ రంగప్ప, జి. వెంకటేశ్వర్లు, భీమ లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


ప్రమాణ స్వీకారంలో కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం పేర్కొన్నారు. అల్లాపూర్ డివిజన్ న్యూ రామారావునగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా గెలుపొందిన రాంరెడ్డి ప్రమాణ స్వీకారం స్థానిక కమిటీ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తప్ప మిగతా సమయాల్లో అభివృద్ధికి పాటుపడాలన్నారు.



పాఠ్యపుస్తకాల్లో రాజ్యాంగాన్ని చేర్చాలి


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు ఆహ్వానపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నేతలు

దుండిగల్: ఆరు నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల్లో భారత రాజ్యాంగాన్ని తప్పనిసరిగా చేర్చాలని దళిత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ, ప్రజా సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు ప్రత్యేక పాఠ్యాంశాలుగా చేర్చాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిత్య పూలమాల కార్యక్రమం 300 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మార్చి 1న సూరారంలోని అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ భవన్ వద్ద భారత రాజ్యాంగ పరిరక్షణ సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ పలువురు నేతలు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆదివారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు అవిజే జేమ్స్, అశోక్, అమర్ బాబు, ఐలయ్య, జీజే రత్నం, యాదగిరి తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



కుత్బుల్లాపూర్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఇందిరానగర్‌లోని శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయంలో త్రయన్విక ప్రతిష్ఠాపనను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులోభాగంగా ధ్వజస్తంభం, నవగ్రహాలు, శ్రీగణపతి, శ్రీపార్వతీదేవి అమ్మవారి విగ్రహాలను పునఃప్రతిష్ఠించారు. అనంతరం నిర్వహించిన యజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాల్లో శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో గౌరిశెట్టి శివఈశ్వర్‌రావు, రాజ్‌గోపాల్ రెడ్డి, దత్తాత్రేయ, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవం..

గాజులరామారం బాలయ్యనగర్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఒగ్గు కళాకారుల సంగీత వాయిద్యాల మధ్య అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బాలయ్యనగర్ ప్రెసిడెంట్ నగేశ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పాల్గొన్నారు.